

తాడికొండ: ఉధృతంగా ప్రవహిస్తున్న కంతేరు రోడ్డులోని ఎర్రవాగు

తడిస్తే.. తీసుకోం

- కొనుగోళ్లలో సీసీఐ మడత పేచీ
- 8 నుంచి 12 శాతం తేమ ఉండాలని ప్రకటన
- వర్షాలతో విపత్కర పరిస్థితి..దిక్కుతోచని స్థితిలో రైతులు



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

పత్తి కొనుగోలుపై సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మడత పేచీలు మొదలు పెట్టింది. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని ప్రకటించింది. తుఫాన్ ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో కొనుగోలు చేసే పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉండాలన్న సీసీఐ ప్రకటనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్‌తో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు పొలాలను వరదలు ముంచెత్తాయి. మొంథా పత్తి రైతులను ముంచేసింది. గుంటూరు జిల్లాలో 59,140 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 2,27,180 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో సుమారు 5 వేల (మిగతా 6వ పేజీలో)



అచ్చంపేట : కోగంటివారిపాలెంలోని పత్తి చేను పరిస్థితి

వ్యాపారుల దోపిడీ..

ఈ ఏడాది పత్తికి సీసీఐ మద్దతు ధర ప్రకటించింది. క్వింటా రూ.8,110(మొదటి శ్రేణి నాణ్యత), దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710 వరకు మద్దతు ధర నిర్ణయించారు. ఇప్పటి వరకు సీసీఐ కేంద్రాల్లో పెద్దగా కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో బయట వ్యాపారులు క్వింటా పత్తి కేవలం రూ.5 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు.

మొంథా పోయి.. వరద వచ్చె

మొంథా ధాటికి మూడు రోజులు జిల్లావాసులు వణికిపోయారు. తుఫాన్ తప్పింది.. ఎండ వచ్చింది.. అని ఊపిరిపీల్చుకుంటున్న తరుణంలో వరద ముప్పు ముంచుకోస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో కృష్ణమ్మ పోటెత్తి ప్రవహిస్తోంది. నది లో అంతకంతకూ వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మళ్లీ నదీ తీరప్రాంతవాసులకు వరద ముప్పు తప్పడంలేదు. ఇప్పటికే ప్రభుత్వం కృష్ణా నదీతీర ప్రాంతవాసులు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతం వెంబడి గ్రామాల్లో అధికారులను అప్రమత్తంగా చేసింది. నిన్నటి వరకు తుఫాన్‌తో వరుణుడు ప్రకోపించి పెనుగాలులతో విరుచుకుపడితే, ఇప్పుడు కృష్ణమ్మ ఉగ్ర రూపం దాల్చుతోందని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణానదిలో పోటెత్తుతోన్న ప్రవాహం

- తుఫాన్ పోయిందని ఊపిరి పీల్చుకునేలోపే ముప్పు
- నదీతీరప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- బ్యారేజ్ నుంచి దిగువకు 5.82 లక్షల క్యూసెక్కులు విడుదల



ప్రకాశం బ్యారేజ్ వద్ద పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

ప్రవాహం ఇలా..

- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.
- పులిచింతల నుంచి గురువారం ఉదయం 6 గంటలకు 4.84 లక్షల క్యూ సెక్కుల వరద నీరు బ్యారేజికి వదిలారు. సాయంత్రానికి 1.51 లక్షల క్యూసెక్కులకి తగ్గించారు.
- కీసర వాగు, మునేరు నుంచి 1.49 లక్షలు, పాలేరు నుంచి 23,967 క్యూసెక్కుల వరద వచ్చి నదిలో చేరుతోంది.
- ప్రకాశం బ్యారేజి నుంచి 1.49 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. అది క్రమంగా పెరుగుతూ రావడంతో మధ్యాహ్నానికి 3.82 లక్షలకు, రాత్రికి 5,82,710 క్యూసెక్కులకు పెరిగింది. 69 గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

తెనాలి,గుంటూరు,తాడేపల్లిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గడచిన వారం రోజులుగా ఇటు జనం కానీ, అటు అధికారులు విరామం లేకుండా తుఫాన్ ముప్పును ఎదుర్కొనేందుకు శ్రమించారు. బుధవారం వాన విరామం తీసుకుంది. గురువారం ఎండ విరగ కాసింది. ఇక వర్షాల నుంచి తేరుకోవచ్చని అటు రైతులు, ఇటు ముంపు ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కృష్ణానదికి వరద తరుముకొచ్చింది. నదిపై ఉన్న జలాశయాలకు ఎగువున కూడా వర్షాలు పడుతుండటం వరదకి కారణమైంది. మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు కురిసాయి. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో వరద నీరు మునేరు నుంచి కీసర ద్వారా ప్రకాశం బ్యారేజికి చేరుతోంది. అటు పల్నాడు జిల్లాలో కురిసిన వర్షాలకు అక్కడా వాగులు పొంగుతుండడంతో నదిలో వరద ప్రవాహం పెరిగింది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు, పులిచింతల నుంచి బ్యారేజికి వదులుతున్న నీటి (మిగతా 6వ పేజీలో)



పిడుగురాళ్ల: పిన్నెల్లి - లక్ష్మీపురం రహదారిలో కొట్టుకుపోయిన కల్వర్టు

రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ప్రకాశం బ్యారేజికి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 15 అడుగుల మేర నీటి మట్టం కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్నానికే వరద ప్రవాహ స్థాయి 3.9 లక్షల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. గురువారం రాత్రికి 5,82,710 క్యూసెక్కుల స్థాయి పెరిగింది. దీంతో బ్యారేజి వద్ద 2వ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు.



తెనాలి: తుఫాన్ బాధితులకు సరుకులు, సాయం అందజేస్తున్న మంత్రి మనోహర్



తుఫాన్ నష్టంపై సమీక్షిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

నష్ట నివేదికలు అందజేయాలి

- తుఫాన్‌పై సమీక్షలో స్పెషల్ సీఎస్ ఆదేశాలు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నష్టాన్ని లెక్కించి తక్షణం నివేదిక అందజేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ఆర్‌పీ సిసోడియా అధికారులను ఆదేశించారు. తుఫాన్ నష్టాలపై గురువారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా తుఫాన్ వల్ల సంభవించిన ఆస్తి, పంట, పశు నష్టంపై జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. 22 వేల హెక్టార్లలో పంట నష్టం అంచనాలపై పరిశీలన చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి తెలిపారు. డీపీవో నాగ సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరుస్తున్నామని, సూపర్ క్లోరినేషన్ జరుగుతుందన్నారు. 228 ట్యాంకులను క్లోరినేషన్ చేశామన్నారు. వర్షాల వలన కెనాల్స్ ఓవర్ ఫ్లో అయ్యాయని, పశ్చిమ డెల్టాలో కొన్ని డ్రెయిన్లు దెబ్బతిన్నాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అనంతరం సిసోడియా మాట్లాడుతూ రైతులకు పంట నష్ట పరిహారం త్వరగా అందించేందుకు అధికారులు త్వరితగతిన నష్ట అంచనాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్‌ఎస్‌కే ఖాజావలి, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, పశుసంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వజ్రశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కల్యాణ్‌చక్రవర్తి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ చెన్నయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.



కొల్లూరు : తుఫాన్ గాలులకు లంక గ్రామాల్లో వాలిపోయిన అరటి చేలు



కాకుమాను: వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రభుత్వ అప్రమత్తతతోనే నష్టనివారణ

- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో మంత్రి నాదెండ్ల
- బాధితులకు బియ్యం, నగదు, సరుకులు పంపిణీ చేసిన మనోహర్
- జిల్లాలో 25 వేల ఎకరాల్లో పంట నష్టం : కలెక్టర్ అన్సారియా

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయడంతో నష్టం తగ్గించగలిగామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. తుఫాన్ ప్రభావిత తెనాలి, కొల్లిపర మండలాల్లో గురువారం మంత్రి పర్యటించి పంటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. తుఫాన్ బాధితులకు బియ్యం, నిత్యవసరాలు, నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాన్‌పై నాలుగు రోజుల ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను అప్రమత్తం చేశారన్నారు. దీంతో ప్రాణనష్టం, ఆస్తి నష్టం, విద్యుత్ శాఖకు నష్టం తగ్గించగలిగామన్నారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసిన ప్రతి కౌలు రైతుకు పరిహారం అందుతుందన్నారు. జిల్లాలో 4553 మంది పునరావాస కేంద్రాలకు చేరారని, వీరికి కుటుంబానికి రూ.3 వేలు, ఒకరైతే రూ.వెయ్యితో పాటు నిత్యావసరాలు, బియ్యం అందజేసినట్లు చెప్పారు. తెనాలి నియోజకవర్గంలో ఆరు వేల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, రైతుల్లో భరోసా కల్పించేందుకు కేంద్రంతో సంప్రదించి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకుచర్యలు చేపడతున్నామని, దళారులకు అమ్మి నష్టపోవద్దని చెప్పారు. గృహ నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రణాళిక రూపొందించి అమలు చేయబోతుందని చెప్పారు. దివ్యాంగుల కోసం సదరం క్యాంపు ఏర్పాటు చేస్తామని, సర్టిఫికెట్లు పొందేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పెన్షన్లు, పథకాలకు అర్హులైన వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదని సచివాలయ అధికారులు, సిబ్బంది గుర్తించి లబ్ధి చేకూరుస్తారని తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 25 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, రెండు రోజుల్లో అంచనాలు రూపొందించి రైతులకు పరిహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనాసింహ, తహసీల్దార్ వి గోపాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



తెనాలి: దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, కలెక్టర్ అన్సారియా

తెనాలి డివిజన్‌లోకి పెదకాకాని?

- వీలుకాకుంటే పొన్నూరు, చేబ్రోలు గుంటూరు డివిజన్‌కు
- నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజన్‌లో.. ప్రభుత్వ ఆలోచన
- ప్రస్తుతం రెండు డివిజన్లలో ఉన్న పొన్నూరు నియోజకవర్గం

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన సమస్యలపై అధ్యయనం చేస్తోన్న కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫార్సుల ప్రకారం చూస్తే పెదకాకాని మండలం తెనాలి డివిజన్‌లోకి మారుతుందని సమాచారం. సబ్ కమిటీ సిఫార్సు ప్రకారం ఒక అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రకారం చూసుకుంటే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పొన్నూరు ఒక్కటే రెండు డివిజన్ల పరిధిలో ఉంది. చేబ్రోలు, పొన్నూరు తెనాలిలో, పెదకాకాని మండలం గుంటూరు రెవెన్యూ డివిజన్లలో ఉన్నాయి. ఈ క్రమంలో పెదకాకానిని తీసుకెళ్లి తెనాలిలో కలిపే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. దీనిపై కొద్ది రోజుల్లోనే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. వైసీపీ హయాంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధి ఆధారంగా జిల్లాని ఏర్పాటు చేశారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, తెనాలి, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గాలతో గుంటూరు జిల్లా ఏర్పాటైంది. ఆ సమయంలో గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిని కూడా తగ్గించాల్సి వచ్చింది. ఈ కారణంగా ప్రత్తిపాడులోని ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు, కాకుమాను వచ్చి గుంటూరు రెవెన్యూ డివిజన్‌లో ఉండేలా చేశారు. అలానే గుంటూరు రూరల్ మండలాన్ని తూర్పు, పశ్చిమ మండలాలుగా విభజించి వీటిల్లోని గ్రామీణ ప్రాంతాలను కూడా ప్రత్తిపాడులో ఉంచారు. గుంటూరు నగర పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలను గుంటూరు డివిజన్‌లో కొనసాగించారు. తాడికొండ నియోజకవర్గంలోని మేడికొండూరు, ఫిరంగిపురం, తుళ్లూరు, తాడికొండ మండలాలను గుంటూరు రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి మండలాలు కూడా మొదట్లో గుంటూరు రెవెన్యూ డివిజన్‌లోనే ఉండేవి. అయితే ఆ తర్వాత వాటిని తీసుకెళ్లి తెనాలి రెవెన్యూ డివిజన్‌లో కలిపారు. దీంతో మంగళగిరి నియోజకవర్గం మొత్తం తెనాలిలో ఉన్నది. పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని గుంటూరుకు సమీపాన ఉన్నందున గుంటూరు డివిజన్‌లో చేబ్రోలు, పొన్నూరు మండలాలను తెనాలి డివిజన్‌లో చేర్చారు. ఇప్పుడు ఒక నియోజకవర్గం.. ఒక రెవెన్యూ డివిజన్‌లో ఉంచాలన్న నిర్ణయం మేరకు పొన్నూరులోని పెదకాకానిని తెనాలిలో కలపాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అది వీలుకాకుంటే పొన్నూరు, చేబ్రోలును తీసుకొచ్చి గుంటూరులో కలపాలి. అప్పుడు తెనాలి డివిజన్ పరిధి తగ్గిపోతుంది. దీనిపై ప్రభుత్వం ఏమి నిర్ణయం తీసుకుంటుందో కొద్ది రోజుల్లో తేలిపోనుంది.

పునరావాస కేంద్రాల్లోనే.. రేషన్

- జిల్లాలో 4,553 కుటుంబాలకు పంపిణీ
- బియ్యం, కందిపప్పు, పంచదార సహా నిత్యావసరాలు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా పునరావాస కేంద్రాలకు చేరిన లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం గురువారం రేషన్ సరుకుల పంపిణీని చేపట్టింది. జిల్లాలో 153 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా 4,553 కుటుంబాలకు చెందిన 9,451 మంది పునరావాసం కల్పించారు. వారికి ప్రభుత్వం గురువారం రేషన్ సరుకుల కిట్లు పంపిణీ చేసింది. ఈ కిట్లలో 25 కిలోల బియ్యం, కిలో పంచదార, కందిపప్పు, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, పామాయిల్ ఉన్నాయి. కాగా చేనేత కార్మికులు, మత్స్యకారులకు మాత్రం 50 కిలోల బియ్యం అందజేయనున్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ద్వారా బియ్యం, కందిపప్పు, పామాయిల్, పంచదార అందిస్తుండగా, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో బంగాళదుంపలు, ఉల్లిపాయలు అందజేశారు.

34,969 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 36,611 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 34,969 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,681 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15200	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	---	----	నెంబరు. 5	10000	14500
341	10000	15800	273	----	---
4884	----	----	341	10000	16000
సూపర్ 10	10000	14500	సూపర్ 10	11000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15300
బ్యాడిగి	10500	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	7800

అర్ధంతరంగా విద్యుదుత్పత్తి నిలిపి వేత


నిండుగా వున్న రిజర్వాయర్

రెంటచింతల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు బుధవారం రాత్రి 10 గంటల నుంచి భారీగా వరద రావడంతో(2 లక్షల 23 వేల క్యూసెక్కుల)విద్యుదుత్పత్తిని అర్ధంతరంగా నిలిపి వేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 5 గేట్లను 2 మీటర్ల మేరఎత్తి 41,200, టేల్ రేస్ చానల్ ద్వారా 8,500 క్యూసెక్కులు మొత్తంగా 49700 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 49,000 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా 7.080 టీఎంసీలకు సమానమన్నారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు 0.9556 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి చేశా రు. ఇప్పటి వరకు 62.3535 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగింది.

రైతులను కేంద్రం ఆదుకోవాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వమే ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. ఇర్లపాడు, ఎండుగుంపాలెం, కోమటినేనివారిపాలెం గ్రామాల పరిధిలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. అవిశాయపాలెం పునరావాస కేంద్రంలో ఉన్న తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం, నిత్యావసరాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ రైతులు మళ్లీ సాగు చేపట్టాలంటే పెట్టుబడిలో సగం కేంద్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో అందిస్తేనే సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు కేంద్రాన్ని సంప్రదించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం హయాంలో వాగుల్లో పూడిక తీయక పోవడంతో వరద నీరు పొలాలు, జనావాసాలను ముంచెత్తిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వాగులు, కాలువల్లో పూడిక తీత పనులపై ప్రభుత్వం దృష్టి పెడితే భవిష్యత్తులో సమస్య ఉండదన్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, జనసేన నేత రాజా రమేష్, తహసీల్దార్ కుటుంబరావు, సర్పంచ్ సామినేని లలిత నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

తడిస్తే.. తీసుకోం

(5వ పేజీ తరువాయి)

ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ నెల 27 నుంచి 29 వరకు కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినింది. తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిచి పోయింది. గుంటూరు జిల్లాలోనే 9308 హెక్టార్లలో, బాపట్ల జిల్లాలో బాపట్ల జిల్లాలో 2,190 ఎకరాల్లో పత్తి పంట దెబ్బ తిన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. పల్నాడు జిల్లాలో ఈ నష్టం ఐదు రెట్లు ఎక్కువగా ఉండనున్నది. తుఫాన్ ప్రభావంతో చాలా చోట్ల పత్తి పొలాలు ఎర్ర తెగులు బారినపడ్డాయి. కొన్ని చోట్ల పూర్తిగా ఉరకెత్తాయి. ఎకరాకు రూ.45 వేల నుంచి రూ.60 వేలు వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. అవి కూడా రాని పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ఈ విధంగా ఉంటే సీసీఐ నెమ్ము లేకపోతే మద్దతు ధర ఇస్తాం, కొనుగోలు చేస్తాం అని చెబుతుండటం రైతులను మరింత నిరాశ, నిస్పృహకు లోనవుతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి 10 సీసీఐ కేంద్రాలు ఉండగా, తేమ శాతం సడలించాలని రైతులు పట్టుబడుతున్నారు.

తేమ నిబంధనను సడలించాలి..

వాస్తవానికి ఆంధ్రప్రదేశ్‌లో పత్తి చేతికి వచ్చే సమయానికి తుఫాన్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గడచిన ఐదేళ్లను ప్రాతిపదికగా తీసుకున్నా సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో తుఫాన్ల ప్రభావంతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. దీంతో పత్తి చేలు పూర్తిగా తడిచి తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ తడిచిన పత్తిని ఆరబెట్టుకునే పరిస్థితి రైతులకు ఉండటంలేదు. రైతు తాను సాగు చేసిన పత్తి నిల్వ, ఆరబెట్టడం తలకు మించిన భారమవుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులు తీసిన పత్తిని తీసి నట్లు అమ్ముకుంటున్నారు. అయితే సీసీఐ మాత్రం రైతులు పత్తిని ఆరబెట్టి తీసుకువస్తే మద్దతు ధరకు కొంటామని చెబుతుంది.

ధాన్యంపై అలా.. పత్తిపై ఇలా

వాస్తవానికి తడిచిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంటుంది. అదేవిధంగా తడిచిన పత్తిని ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయదన్న ప్రశ్న తలెత్తుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంత చెప్పినా తడిచిన పత్తిని సీసీఐ కొనే పరిస్థితి లేదు. ఈ తరుణంలో ఈ ఏడాది రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్న విజ్ఞప్తి లేకపోలేదు.

మొంథా పోయి.. వరద వచ్చే

(5వ పేజీ తరువాయి)

స్థాయి కచ్చితంగా తెలుస్తున్నా, బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వచ్చి చేరుతోన్న వరద అంచనా లెక్కకు అందడంలేదు. దీంతో అధికారులు శుక్రవారానికి మరింతగా ఉధృతి పెరుగుతుందన్న అంచనాలో ఉన్నారు.

లంక గ్రామాల్లో మళ్లీ భయం

లంక గ్రామాలు మరోసారి భయం గుప్పిట్లోకి చేరాయి. గత వరదలకు సంబంధించి ఏర్పడిన నష్టాల నుంచి తేరుకోక ముందే వరద భయం వెంటాడు తోంది. మిగిలిన పంటలు కూడా దక్కవనే ఆవేదనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాలను ఇప్పటికే రెండు దఫాలుగా వరదలు ముంచేశాయి. అరటి మినహా, పసుపు, కంద, మినుము, కూరగాయల సాగు చేస్తున్న రైతులు తీవ్ర నష్టాని చవిచూశారు. నిన్నటి తుఫాన్ పెనుగాలలకు అరటి చెట్లు కూడా కుదలయ్యారు. పసుపు, కంద వంటి దుంప పంట గత నష్టాలను తట్టుకుని కొద్దిగా అయినా దిగుబడిని రైతుకు దక్కనిస్తాయనుకుంటే వరద భయం మళ్లీ వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. నదిలో వరద ఉధృతి పెరగడంతో మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం రాత్రి కొల్లిపర మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ ను సమర్థంగా ఎదుర్కొన్నామని, వరద విషయంలోనూ భయపడాల్సిన పనిలేదని, దీనిని కూడా అధికమిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం యూజీ, పీజీ కోర్సుల


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం

పరీక్ష ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్. శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గురువారం విడుదల చేశారు. బీఏ, బీకాం, బీబీఏ తృతీయ సెమిస్టర్, ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసి.. వచ్చే నెల 12లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. యూజీ కోర్సులకు రూ. 770, పీజీ కోర్సులకు రూ.960లు ఒక పేపర్‌కు ఫీజు చెల్లించాలని తెలిపారు. దూర విద్య కేంద్రం డైరెక్టర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కోఆర్డినేటర్ రామచంద్రన్, డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్ పాల్గొన్నారు.

హార్స్ రేసింగ్ క్లబ్‌లో చోరీ

● రూ.4.37 లక్షల నగదు మాయం

పెదకాకాని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని రోడ్డులోని హార్స్ రేసింగ్ క్లబ్‌లో చోరీ ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం క్లబ్‌కు నిర్వాహకులు తాళాలు వేశారు. బుధవారం యథావిధిగా క్లబ్ తాళాలు తీసి.. ప్రారంభించారు. అయితే కౌంటర్‌లో ఉంచిన రూ.4.37లక్షల నగదు కనిపించ లేదు. సొత్తు చోరీకి గురైందని గ్రహించి.. అక్కడ పనిచేస్తున్న గూంటూరు మహిళ తుమ్మ నాగలత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00



4 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువన శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,739, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,400, మొత్తం ఔట్‌ఫ్లో 66,139 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,49,139 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎమ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ కేవీ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని క్రోసూరు, అమరావతి, తుళ్ళూరు, తాళ్ళూరు, పర్చూరు రూట్‌లలో సమస్యలు, సిబ్బంది ప్రవర్తనపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులు 9959225420కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ఫుట్‌బాల్‌లో నారాయణ విద్యార్థిని సత్తా

● రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


వరపర్ల ప్రవల్లిక

గుంటూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కోటప్పకొండలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి జట్టుకు నారాయణ జూనియర్ కళాశాల (కొత్తపేట బ్రాంచి) విద్యార్థిని వరపర్ల ప్రవల్లిక ఎంపికైనట్లు డీజీఎం కె.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో మెరుగైన శిక్షణ అందిస్తున్నామని, ఫలితంగానే తమ విద్యార్థిని పోటీల్లో రాణించిందని చెప్పా రు. విద్యార్థి ప్రవల్లికను డీన్ కోటేశ్వరరావు, ఏజీఎం రామరావు, ప్రిన్సిపాల్ జానీ, పీఈటీ వినయ్, బ్రహ్మేశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నేడు నగరానికి వైద్య మంత్రి రాక

గుంటూరు (తూర్పు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం నగరానికి రానున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి నిర్వహించే సర్దార్ 150వ యూనిటీ మార్చ్‌లో ఆయన పాల్గొననున్నారు.

కాలభైరవాష్టకంపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గురువారం కాలభైరవాష్టకంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ సభ్యులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుందర సత్సంగ్ సభ్యులు కె.వి కోటేశ్వరరావు ప్రవచిస్తూ కాల భైరవుడిని హిందూ మతంలో శివుని ఉగ్ర రూపంగా భావిస్తారన్నారు. ఆయనకు అంకితం చేయబడిన కాల భైరవ అష్టకం అనే భక్తిగీతం ఆయన భక్తులలో బాగా ప్రాచుర్యం పొందిందన్నారు. కాలభైరవాష్టకాన్ని పారాయణం చేస్తే భయం, అశాంతి, ప్రతికూల శక్తిని తగ్గించుకోవచ్చని అన్నారు. ఇది మానసిక, ఆధ్యాత్మిక వృద్ధిని ప్రోత్సహిస్తుందని తెలియజేశారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు (తూర్పు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాలుగో తరగతి ఉద్యోగులైన లవ్‌కుమార్, భరత్‌ను కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన చిత్తూరు జిల్లా వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమీషనర్ రవీంద్రరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అమరావతి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు ఎస్.మల్లేశ్వరరావు, టి.చెన్నప్ప డిమాండ్ చేశారు. సదరు అధికారిపై క్రమణశిక్షణా చర్యలు తీసుకొని, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఘటనపై విచారించాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చిన మంత్రి పయ్యావుల కేశవ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

తుఫాన్ వేళ జీఎంసీ స్ఫూర్తిదాయక కృషి

● నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు


మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా జీఎంసీ స్ఫూర్తిదాయక కృషిచేసిందని నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలో తుఫాన్ సమయంలో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా సమర్థవంతమైన చర్యలు చేపట్టామని వారు తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో కమిషన్ శ్రీనివాసులుతో కలిసి మేయర్ రవీంద్ర మాట్లాడారు. అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకొని సమన్వయంగా పనిచేయడం వల్లే నగరంలో తుఫాన్ వల్ల కలిగిన నష్టాన్ని తగ్గించగలిగామని అన్నారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్థవంతంగా పనిచేసిందని చెప్పారు. 90 ప్రాంతాల్లో కూలిన చెట్లను, 50 అడుగులకు పైగా ఎత్తు ఉన్న 6 బోర్డులను, 69 పెద్ద, 123 చిన్న హోర్డింగ్స్‌ను తొలగించామన్నారు. శిధిలావస్థలో ఉన్న 71 భవనాలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన 30 పునరావాస కేంద్రాల్లో 1943మంది చేరారని, వారికి ఆహారం, తాగునీరు, మౌలిక వసతుల కల్పించామని చెప్పారు. తుఫాన్ పరిస్థితుల్లో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, హార్టికల్చర్ విభాగాలు, ముఖ్యంగా నియోజకర్గాల స్పెషల్ అధికారులైన డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు అంకితభావంతో పనిచేశారని అన్నారు. మరో రెండు రోజులు ఇదే ఉత్సాహం కొనసాగితే బాధిత ప్రజలకు మరింత ఊరట కల్పించగలుగుతామని చెప్పారు. కష్ట సమయంలో ప్రజలకోసం పనిచేసిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులకు నగరపాలకసంస్థ నుంచి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి


రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. తుఫాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల బాధితులకు గురువారం ఆమె ప్రభుత్వ రేషన్‌ను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఏటి అగ్రహారంలోని రేషన్ షాపు వద్ద బాధితులకు ప్రభుత్వం తరఫున బియ్యం, పప్పు, నూనె, కూరగాయలు, పంచదార, ఉల్లిపాయలు వంటి నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు ఒక విపత్కర పరిస్థితిని కలిసికట్టుగా ఎదుర్కొన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కృషితో రాష్ట్రవ్యాప్తంగా ఈ తుఫాన్‌ను ఎంత ప్రణాళికబద్ధంగా ఎదుర్కొన్నామో ప్రజలందరూ చూశారని అన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం పెద్దగా లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 325 మంది తుఫాన్ బాధితులు గత రెండు రోజులుగా పునరావాసకేంద్రాల్లో ఆశ్రయం పొందారని, వారికి ఏటీ అగ్రహారంలో నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని చెప్పారు. సహాయక చర్యల పట్ల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. తమ కార్యకర్తలు, కార్పొరేటర్లు ప్రజలతోనే ఉండి సేవ చేశారని, అందువల్లే ఈ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోగలిగామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

మార్కెట్‌లో వ్యాపారాల సందడి

● సాధారణ స్థితికి జనజీవనం...


మార్కెట్ సెంటర్‌లో వాహనాల రాకపోకలతో రద్దీ

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గండం గడిచిపోవటంతో జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంది. గురువారం భానుడి కిరణాలు తాకటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఒక వైపు కార్తీకమాసం మరో వైపు వాతావరణం కూడా సాధారణ స్థితికి చేరుకోవటంతో మార్కెట్‌లో కోలాహల వాతావరణం నెలకొంది. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. తుఫాన్ ప్రకటనతో ముందుగానే ఇంట్లోకి అవసరమైన నిత్యావసర సరుకులను తెచ్చుకొని జాగ్రత్తలు పడ్డారు. మార్కెట్‌లో కూడా దాదాపుగా వివిధ వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేసుకున్నారు. ఇక అడపాదడపా నిత్యావసర దుకాణాలు, కూరగాయల దుకాణాలు తెరిచినప్పటికి వ్యాపారాల్లేక వెల వెలబోయాయి. రోజువారీగా ఉండే సాధారణ వ్యాపారం కూడా లేక వ్యాపారులు ఉసూరుమనాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంది. వాతావరణం సాధారణ స్థితికి చేరుకోవటంతో జనజీవనం తిరిగి నిత్య కార్యకలాపాల్లో నిమగ్నమైంది. ప్రధానంగా నగరంలోని మార్కెట్ సెంటర్, లాలాపేట, పట్నంబజారు, బస్టాండ్ సెంటర్, బ్రాడీపేట, అరండల్‌పేట, గుజ్జనగుండ్ల, కొరిటపాడు సెంటర్‌లలో ప్రజల రాకపోకలు, వ్యాపారాలతో కోలాహల వాతావరణం నెలకొన్నది.

● చిరువ్యాపారులు, రోజూవారీ కూలీలు విలవిల

మొంథా తుఫాన్‌తో రోజువారీ పనులు చేసుకొనే కూలీలతో పాటు చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజులుగా వ్యాపారాలు లేక చిరు వ్యాపారులు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అలానే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు తుఫాన్‌తో బయటకు రాలేక ఇబ్బందులు పడ్డామని వాపోయారు. మొత్తానికి నాలుగు రోజుల తర్వాత వాతావరణం సాధారణ స్థితికి చేరుకోవటంతో ప్రజలు తమ రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యారు.

చైన్ స్నాచింగ్ కేసులో దోషికి ఆరు నెలల జైలు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో ఆనందపేటకు చెందిన నిందితుడు షేక్ అమీర్ బేగ్ అలియాస్ జోహరి (39)ను గుంటూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ కోర్టు దోషిగా తేల్చి శిక్ష విధించింది. ఈ ఏడాది జనవరిలో స్తంబాలగరువు ప్రాంతంలో ఓ మహిళ మెడల్లోంచి గొలుసు దొంగలించిన కేసులో అమీర్ బేగ్ అరెస్టయ్యాడు. విచారించిన కోర్టు అతడిని దోషిగా తేల్చి 6 నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. వెంకటేశ్వరరావు ఈ కేసును వాదించారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ


తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్, కవమిషనర్ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులకు గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మొహ్మద్ నసీర్‌తో కలిసి మేయర్ రవీంద్ర నిత్యావసరాలను అందజేశారు. అంకమ్మనగర్, చౌత్రా సెంటర్లలో తుఫాన్ ప్రభావిత కుటుంబాలకు వీటిని అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తుఫాన్ అనంతరం ప్రభావిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉండడం బాధితులకు ఎంతో భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, కార్పొరేటర్లు అడకా పద్మావతి, ఖాజా మొహిద్దీన్ చిస్తీ, ఈరంటి వరప్రసాద్, గుంటూరు పశ్చిమ, తూర్పు తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, సుభాని, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసు సేవలు వివరించేందుకే ఓపెన్ హౌస్

● ఎస్పీ వకుల్ జిందాల్


విద్యార్థులకు తుపాకుల వినియోగం గురించి వివరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజానికి పోలీసులు చేస్తున్న సేవలు విద్యార్థులకు తెలియజేయడమే ఓపెన్ హౌస్ ఉద్దేశమని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం పోలీస్ కల్యాణ మండపంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ వకుల్ జిందాల్ హాజరై శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల ఉపయోగించే వివిధ ఆయుధాలు, పరికరాల గురించి విద్యార్థులకు స్వయంగా వివరించారు. ఆయుధాలు, వేలిముద్రలు, భద్రత పరికరాలు, జాగిలాలు, సమాచార, పోలీస్ కంట్రోల్ రూమ్ తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయా పరికరాల వినియోగం, కేసుల దర్యాప్తులో వాటి ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విద్యార్థులకు సమాజ సేవ పట్ల ఆసక్తిని కల్పించడం, పోలీస్‌శాఖ పట్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాలల విద్యార్థులు పోలీస్ శాఖ ఉపయోగించే ఆయుధాలు, పరికరాలను ఆసక్తిగా తిలకించారు. జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు ఆధ్వర్యంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, లాలాపేట సీఐ శివప్రసాద్, ఆర్ఐలు శివరామకృష్ణ, సురేష్, శ్రీహరి రెడ్డి, శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరెకటిక కార్పొరేషన్ ఏర్పాటు చారిత్రాత్మకం



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ఆరె కటిక సంఘు సభ్యులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరెకటిక సామాజిక వర్గ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయడంతో పాటు, చైర్మన్‌ను నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని ఆరెకటిక సంఘ రాష్ట్రాధ్యక్షుడు మిర్యాలకార్ చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులో గురువారం సంఘ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గుంటూరు జిల్లా సంఘ అధ్యక్షుడు డాకుపాటి కామేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మిర్యాలకార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, కార్పొరేషన్‌తో ఆర్థిక, విద్య, ఇతర రంగాల్లో ఆరెకటికలు వృద్ధి సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చైర్మన్ నియమించినప్పటికి డైరక్టర్ల భర్తీ నేటికీ జరగలేదని అన్నారు. కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, అర్హత కల్గిన బీసీ సాధికారిత సమితి వ్యక్తులకు ఈ పదవులు ఇవ్వాలని కోరారు. డైరక్టర్ల పదవులను ఎమ్మెల్యేలు సూచించిన పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి జిల్లాలో సంఘానికి కమ్యూనిటీ భవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆధునిక స్లాటర్ హౌస్‌లు ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతలను తమ సామాజిక వర్గానికి అప్పగించాలని కోరారు. దేశంలో 18 రాష్ట్రాల్లో ఆరెకటికలకు ఎస్సీ హోదా కల్పించారని, దీనికి దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. అనంతరం చంద్రశేఖర్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లా అధ్యక్షులు సురే కల్యాణ ఉమామహేశ్వరరావు, మిర్యాలకార్ భాస్కరరావు, ఇతర జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు

● వ్యభిచార, లాటరీ ముఠాల గుట్టురట్టు


పోలీసుల దాడిలో పట్టుబడిన వ్యభిచార ముఠా

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టాస్క్ ఫోర్స్ బృందం దాడులు చేసి కొత్తపేటలో వ్యభిచార ముఠా, పాత గుంటూరులో సింగల్ నంబర్ లాటరీ ముఠా గుట్టురట్టు చేసింది. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం గుంటూరు వారి తోట 8వ లైన్‌లోని ఓ హోటల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఆకస్మిక దాడి నిర్వహించింది. ఈ సందర్భంగా ఇరువురు యువతులను, నలుగురు పురుషులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 4 సెల్‌ఫోన్లను సీజ్ చేసింది. అదేవిధంగా నందివెలుగు రోడ్డులో సింగిల్ నంబర్ లాటరీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వనిమిరెడ్డి నందిమోహన్ రెడ్డి అనే నిందితుడిని అదుపులోకి తీసుకుంది. అతని నుంచి రూ.1940 సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించింది.

క్రైస్తవుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తేవాలి

● ఐద్వ వ్యవస్థాపకులు డాక్టర్ గోళ్ళమూడి రాజు సుందరంబాబు


మోకాళ్లపై ప్రార్థనలు చేస్తూ నిరసన తెలుపుతున్న పాస్టర్లు, క్రైస్తవ సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లు, చర్చీలు, క్రైస్తవుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని, క్రైస్తవ సమాధితోటలకు భూమిని మంజూరుచేయడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ఐద్వ వ్యవస్థాపకులు డాక్టర్ గోళ్ళమూడి రాజు సుందరంబాబు డిమాండ్ చేశారు. క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట పాస్టర్లు, క్రైస్తవసంఘ నాయకులు మోకాళ్లపై కూర్చొని ప్రార్థనలు చేస్తూ వినూత్ననిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోధనలు చేసేవారిపై దాడులు చేయడం అప్రజాస్వామికమన్నారు. నగరంలో క్రైస్తవులకు సమాధి స్థలాలు లేవని, దీనిని దృష్టిలో పెట్టుకొని శివారులో లింగాయపాలెం, పొత్తూరు వద్ద స్థలాలను కేటాయించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ అశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రాన్ని అందజేశారు. తొలుత స్థానిక నగరంపాలెం బాప్టిస్ట్ చర్చి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు జి.సుధీర్ కుమార్, శామ్యూల్ కోటేశ్వరరావు, వరబాబు, వీరారెడ్డి, షేక్ మదర్, దయరత్న, ఐద్వా సంఘం అధ్యక్షులు బేతపూడి భారతి, వట్టిచెరుకూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డి.సుందర్ సింగ్, అంటోని పాల్గొన్నారు.

వారంటే వ్యాపారులకు హడల్

● పూలమార్కెట్‌లో చేరి కొందరి దౌర్జన్యం


పూల మార్కెట్‌లో కూల్చిన గోడ

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న హోల్‌సేల్ పూలమార్కెట్‌లో కొంత మంది ఇటీవల చేరి వ్యాపారులను హడలెత్తిస్తున్నారు. రాజకీయ పలుకుబడితో కొన్ని దుకాణాలు సొంతం చేసుకోవడమే గాక ఎన్నో ఏళ్ళుగా అక్కడ వ్యాపారం చేసుకుంటున్న తమపై దౌర్జన్యం చేస్తున్నారని బాధిత వ్యాపారులు వాపోతున్నారు. తమను బెదిరించి దుకాణాలు ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కనీసం ఎస్టేట్ అధికారులు కూడా వారిని నియంత్రించడంలేదని వాపోతున్నారు. గతంలో ఎన్ని ఒత్తిళ్ళు వచ్చినా తొలగించని గోడను రాత్రికి రాత్రి తొలగించడం వివాదాస్పదంగా మారింది. అదేమంటే రాజకీయ నాయకుల పేర్లు చెప్పి తమను బెదిరిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గోడ కూల్చిన వ్యవహారంతో వారి ఆగడాలు తారస్థాయికి చేరాయని, ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పూల వ్యాపారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఏటుకూరు గ్రామానికి సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద మంగలవారం రాత్రి జరిగింది. వాహనం ఢీ కొనడంతో అతడు మృతి చెంది ఉంటాడని పోలసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతునికి సుమారు 40 సంవత్సరాల వయసు ఉంటుందని, చామనఛాయ రంగులో, సన్నగా ఉన్నాడని, అతడి ఎత్తు సుమారు 5.4 అడుగులు ఉంటుందని తెలిపారు. మెరూన్, బులుగు రంగు గడులు డిజైన్ కలిగిన అర చేతుల చొక్కా, బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరచామని, ఆచూకి తెలిసిన వారు నల్లపాడు సీఐ వంశీధర్‌కు 8688831376కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.


నగరంలోని మురికిపేటలో పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు సిబ్బంది

అంటువ్యాధులు ప్రబలకుండా చూడండి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా నీరు నిలిచి ఉంటే బెయిల్ అవుట్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ చుట్టుగుంట దగ్గరలోని మురికిపేట, ఏటి అగ్రహారం ప్రాంతాలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా వర్షపునీరు, చెత్త లేకుండా శుభ్రం చేయాలన్నారు. వర్షపు నీరు ఆగి ఉన్న ప్రాంతాల్లో మలాథిన్ పిచికారీ చేయాలని, ఆయిల్ బాల్స్ వేసి దోమల లార్వా వృద్ధి చెందకుండా చూడాలన్నారు. శుభ్రం చేసిన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని తెలిపారు. వర్షం వల్ల పాడైనా రోడ్లు, మురుగునీటి కాలువలను మరమ్మత్తు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఎస్ అంగడి రాజేశ్, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


వీవీఐటీ యూనివర్సిటీలో జరిగిన ఐక్యా 2కే25 కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

వీవీఐటీ వర్సిటీలో ఐక్యా 2కే 25

పెదకాకాని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ (వీవీఐటీ) యూనివర్సిటీలో గురువారం ఐక్యా 2కే 25 కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ సాంకేతిక సదస్సు జరుగుతున్నట్లు విశ్వవిద్యాలయం ప్రొ చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. ఈ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సీహెచ్ దినేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సులో 30 కళాశాలలకు చెందిన 1400 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సదస్సులో కోడ్ వర్డ్, స్పెల్ బిడ్, ఐక్యా ఇన్నోవేషన్ హ్యాకథాన్, హాగ్వార్ట్స్ హంట్ వంటి 15 సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దినేష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని అన్నారు. గేట్ పరీక్ష, యూపీఎస్సీ పరీక్షలను లక్ష్యంగా చేసుకొని చదవాలని సూచించారు. అనుకున్న లక్ష్యాలు సాధించేవరకూ నిరంతరం శ్రమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ కె.గిరిబాబు, ఈసీఈ విభాగాధిపతి ఎమ్.భానుమూర్తి ఐఈటీఈ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్రౌన్ జయంతి అధికారిక నిర్వహణపై హర్షం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బ్రిటీషు కాలంలో ఆంధ్ర ప్రాంతంలో ఉన్నతాధికారిగా పనిచేసి తెలుగు భాషా, సాహిత్యానికి విశేష సేవలు అందించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతిని అధికారికంగా నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ప్రధానకార్యదర్శి వల్లూరి శివప్రసాదు అభినందనలు తెలిపారు. వేమన, ఇతర గొప్ప కావ్యాలను సొంత ఖర్చుతో సేకరించి, వాటిని ప్రచురించిన బ్రౌన్ జయంతిని అధికారికంగా నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయం సముచితమని అన్నారు. నవంబరు 10న జరిగే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచస్థాయిలో రాష్ట్ర గ్రంథాలయాన్ని అమరావతిలో స్థాపించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వారు అభినందించారు. కాకపోతే ఆచార్య నాగార్జునుడు బోధనలు చేసిన ధరణికోటలో ఏర్పాటు చేస్తే సముచితంగా ఉంటుందని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీనగర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాజీవ్ గాంధీ నగర్ 7వ లైన్‌కు చెందిన నల్లపురెడ్డి మనోహర్ రెడ్డి (45)కి 19 సంవత్సరాల క్రితం నెల్లూరుకు చెందిన మహిళతో వివాహం జరిగింది. వారికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. మనస్పర్థలు కారణంగా భార్యభర్తలు విడివిడిగా ఉంటున్నారు. గతంలో మనోహర్‌రెడ్డికి గుండెపోటు రాగా వారం రోజులు పాటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. బుధవారం రాజీవ్‌గాంధీనగర్‌లో తన బంధువులకు చెందిన గదిలో నిద్రించిన అతడు అక్కడే అనుమానస్పద రీతిలో మృతి చెంది కనిపించాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్ పేట పోలీసులు తెలిపారు.

నీట మునిగిన పంటలను సంరక్షించుకోవాలి

సస్యరక్షణతో దిగుబడులు చేతికి.. నష్ట నివారణ

ఏడీఏ నాగభైరు మోహన్‌రావు

పంటలకు ప్రాణం పోద్దాం



మేడికొండూరు మండలంలో పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నాగభైరు మోహన్ రావు

వేరుశనగ

పంట పక్వ దశలో ఉంటే వర్షాలు తగ్గే వరకు పైరు పెరకడం, తీయడం చేయకూడదు. పెరికిన పైరును కుప్పలుగా వేస్తే.. కాయలు మొలకలు వస్తాయి. పైరు వాదెలుగా ఉంచి పొలాల్లో నీరు చేరని ప్రదేశంలో ఆరబెట్టి ఉంచాలి. పొలంలో మురుగు నీరు తొలగించాలి. అక్టోబరు మొదటి వారంలో విత్తిన పైరుకు మొదలు కుళ్లు, ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. నివారణకు వర్షం తగ్గిన వెంటనే మాంకోజెబ్ 2.5 గ్రాములు + కార్బండజిమ్ 12 శాతం లేదా హెక్సాకోనజోల్ 2.0 మీ.లీటర్లు లీటరు నీటిలో కలిపి మొక్కలు బాగా తడిచేలా పిచికారి చేయాలి. విత్తుకు ముందు కిలో విత్తనానికి కార్బాక్సిన్(37.5శాతం) + థైరామ్ (37.5శాతం) 3గ్రాములు లేదా మాంకోజబ్ + కార్బండజిమ్ 25 శాతం 2 గ్రాములు లేదా పెంఫ్లూఫెన్ 13.28 + ట్రిఫ్లోక్సిస్ట్రోబిన్ 13.28 (2 మీ.లీ+ 4 మీ.లీ నీరు) కలిపి విత్తన శుద్ధి చేయాలి. లేత పైరుకు పొగాకు లద్దె పురుగు ఆశిస్తుంది. దీని నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 5% 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మినుము, పెసర

మినుము, పెసర పంటలు మొలక దశ నుంచి శాఖీయ, పూత నుంచి కాయ కోత దశలలో ఉన్నాయి. మొలక దశ నుంచి శాఖీయ దశలో ఉన్న పంట ముంపునకు గురైన పొలాల్లో మురుగు నీరు వీలైనంత త్వరగా తొలగించాలి. ఇనుపధాతు లోపం కనిపించే అవకాశం ఉంది కావున.. నివారణకు అన్నబేది 50 గ్రాములు + నిమ్మ ఉప్పు 5 గ్రాములు+ యూరియా 100 నుంచి 150 గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. దీంతో పంట సమర్థంగా కోలుకోవడానికి దోహదపడుతుంది. వారం తర్వాత ఒక శాతం 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేయాలి. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల రాకుండా హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ పిచికారి చేయాలి.

పూత నుంచి కాయ దశ

ముంపునకు గురైన పొలాల్లో మురుగు నీరు వీలైనంత త్వరగా తొలగించాలి. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల రాకుండా హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్‌ను పిచికారి చేయాలి. మారుక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. దీనికి క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి లేక నోవాల్యురాన్ 10 ఇ.సి ఏదో ఒక మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

గుంటూరు సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని రైతులు మొంథా తుపాను తర్వాత చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలను తుపాను ప్రభావిత మండలాలకు తీసుకువెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు ఏడీఏ నాగభైరు మోహన్‌రావు శాస్త్రవేత్తలతో కలిసి పలు మండలాల్లో పర్యటించారు. పంటలు ముంపునకు గురైన రైతులు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక సూచనలు చేశారు. ఈ సూచనలు పాటిస్తే పంటలకు తిరిగి ప్రాణం పోయవచ్చని ఏడీఏ తెలిపారు.

పంట ముంపు అనంతర సూచనలు

పత్తి

90 రోజుల పంటలో (పూత, కాయ ఏర్పడి, వృద్ధి చెందే దశ)చాళ్లు ఏర్పాటు చేసి మొక్కలో గాలి, కాంతి ప్రసరణను పెంచాలి. యూరియా లేదా పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 ని ఒక శాతం మెగ్నీషియం సల్ఫేట్‌తో పాటుగా రెండు సార్లు 7 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. 5 గ్రాములు/లీ బోరాక్స్ 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

కాయ కుళ్లని తగ్గించడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) + 0.1 గ్రాములు స్ట్రెప్టోసైక్లిన్/లీటరు మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యగా 3 గ్రాములు లీటరు నీటికి మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) పిచికారీ చేయాలి. (లేదా) ప్రొపికోనజోల్ గాని లేక క్రేసోక్సిమ్ మిథైల్ గాని 1 మీ.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4. 5% నాఫ్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. 20 నుంచి 22 కణుపుల ఎత్తులో ప్రధాన కాండపు తల తుంచడం పాటించాలి.

120 రోజుల పంట (కాయ పెరిగి పగిలే దశ)

పంటలో చాళ్ల ఏర్పాటు చేసి మొక్కల్లో గాలి, కాంతి ప్రసరణను పెంచాలి. వర్షాలు తగ్గిన పొడి వాతావరణంలో పత్తి తీతను చేయాలి. తేమ ఎక్కువగా ఉంటే, నీడలో ఆరబెట్టాలి.

5 గ్రా./లీ బోరాక్స్ 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

కాయ కుళ్లని తగ్గించడానికి 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) + 0.1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ / లీ. మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిచేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా ఉండడానికి ముందస్తు చర్యగా 3 గ్రా./లీ. మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) పిచికారీ చేయాలి. (లేదా) ప్రొపికోనజోల్ గాని లేక క్రేసోక్సిమ్ మిథైల్ గాని 1 మీ.లీ./ లీ. మోతాదులో పిచికారీ చేయాలి.

గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4.5% నాఫ్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. 20 నుంచి 22 కణుపుల ఎత్తులో ప్రధాన కాండపు తల తుంచడం పాటించాలి.

మొక్కజొన్న

పొలాల్లో నిల్వ నీటిని 48 గంటల్లోగా తొలగించాలి. పొలం ఎండిన తర్వాత ఒక శాతం యూరియా, 0.5శాతం జింక్ సల్ఫేట్ కలిపి ఆకులపై పిచికారీ చేయాలి. కోతకు వచ్చిన మొక్కజొన్న పొత్తులను తక్షణం కోసి, వాటిని 13శాతం తేమ స్థాయికి ఆరబెట్టడం ద్వారా మొలకెత్తడం, నాణ్యత తగ్గుదలను నివారించవచ్చు. తేమ సాగుతున్న ప్రాంతాల్లో మొక్కజొన్న పంటపై ఫంగస్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రొపికొనజోల్ (0.1శాతం) వంటి తగిన ఫంగిసైడ్‌ను పిచికారి చేయాలి.

కంది..

ప్రస్తుతం కంది పంట మొలక దశ నుంచి పూతకు వస్తోంది. ఇనుపధాతు లోపం నివారణకు.. అన్న బేది 50 గ్రాములు + నిమ్మ ఉప్పు 5 గ్రాములు + యూరియా 100 నుంచి 150 గ్రాములను 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి.

పంట కోలుకోవడానికి 19: 19: 19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తే.. కాపెర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి వేర్లు తడిచేట్లు మొదళ్లలో పోయాలి. పంట పూత దశలో ఉన్నట్లయితే మారుక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. దీనికి క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి లేక నోవాల్యురాన్ 10 ఇ.సి లేదా స్పైనోసాడ ఏదో ఒక మందును పిచికారి చేయాలి.



తుఫాన్ ధాటికి విరిగిపడ్డ అరటి చెట్లు

వాణిజ్యం.. విలవిల

● కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాతలు

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు దెబ్బతిన్న వాణిజ్య పంటలు రోజుకో విధంగా రూపురేఖలు కోల్పోతున్నాయి. మండలంలోని చిలుమూరులంక, సుగ్గునలంక, ఈపూరులంక, చింతలంక, పెదలంక, పోతార్లంక, కిష్కిందపాలెం తదితర లంక గ్రామాల్లో రైతులు అరటి, బొప్పాయి, తమలపాకు, కంద, పసుపు తదిర వాణిజ్య పంటలతో పాటు మినుము, కూరగాయ పంటలను సాగు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం తుఫాన్ తీరం దాటే సమయంలో బలంగా వీచిన గాలులకు అరటి, బొప్పాయి, తమలపాకు, పసుపు, కంద, కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పోతార్లంక సమీపంలో పలుచోట్ల అరటి తోటలు గాలి తీవ్రతకు కూకటివేళ్లతో సహా విరిగిపడ్డాయి. వర్షం, గాలుల తీవ్రతకు కంద, పసుపు, బొప్పాయి పంటలు కూడా దెబ్బతినగా వర్షపు నీటిలో ఉన్న పసుపు కుళ్లిపోతోంది. కంద పైరు చెట్లు విరిగిపోవడం దుంప ఊరే పరిస్థితి లేకుండా పోయింది. బొప్పాయి చెట్లు విరిగిపోవడంతో పాటు కాయలు పూర్తిగా రాలిపోయాయి. చింతల్లంక వద్ద సాగులో ఉన్న దొండ, కాకర పందిళ్ల కుప్పకూలిపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు తుఫాన్ తాకిడికి గురై కళ్ల ముందు జీవం కోల్పోతుంటే అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వం అరకోర అందించే సాయానికి తాము నష్టపోయిన దానికి పొంతన లేకుండా ఉంటోందని.. పరిహారం పెంచి అందిస్తే కొంత వరకు కోలుకునే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



కుళ్లిపోతున్న పసుపు పైరు



గాలులకు పడిపోయిన కందపైరు



ఈదురుగాలులకు పడిపోయిన కాకర పందిళ్లు

కొండవీటి వాగు రివర్స్ ఫ్లో

రెగ్యులేటర్ దెబ్బతినడంతో ఎదురెళ్తున్న వరద

లిఫ్ట్ ద్వారా నదిలోకి తోడుతున్న యంత్రాంగం

విజయవాడ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలోని వరద నీటిని కృష్ణా నదిలోకి చేరవేసే కొండవీడు వాగు రెగ్యులేటర్ ప్రమాదస్థాయికి చేరింది. నదిలో పెరిగిన వరద నీరు దెబ్బతిన్న రెగ్యులేటర్ గేట్ల ద్వారా తిరిగి వాగులోకి చేరుతోంది. రాజధాని ప్రాంతంలోని లాం గ్రామం నుంచి కొండవీడు వాగు ప్రారంభమై పెదపరిమి, నీరుకొండ, కృష్ణాయ పాలెం, పెనుమాక, తుళ్లూరు, వెలగపూడి మీదుగా కృష్ణానదిలోకి చేరుతుంది. 30 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ వాగులోకి కొట్టెళ్ల వాగు, పాలవాగు, ఎర్రవాగులు సైతం కలుస్తాయి. ఆయా ప్రాంతా లు ముంపుబారిన పడకుండా ఈ వాగులే రక్షణగా ఉంటాయి. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి ఆయా ప్రాంతాల్లోని సాగు భూముల్లోకి భారీగా నీరు చేరింది. ఆ నీటిని అంతా కొండవీడు వాగు మాత్రమే కృష్ణా నదిలోకి చేరవేయాల్సి ఉంటుంది. కృష్ణానదిలో నీరు తక్కువగా ఉంటే కృష్ణానది వద్ద కట్టిన రెగ్యులేటర్ నుంచి ఈ నీరు గ్రావిటీ ద్వారా నదిలో కలుస్తుంది. నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్న సందర్భాల్లో రెగ్యులేటర్ గేట్లను దించేసి, పక్కనే ఉన్న లిఫ్ట్ ద్వారా నదిలోకి తోడతారు.



కొండవీటి వాగు వద్ద వరద ఉధృతి

నదిలో నీళ్లు నదిలోకే..

దాదాపు 30 ఏళ్ల కిందట కట్టిన రెగ్యులేటర్ గేట్లు అన్నీ దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా అమరావతి నుంచి వస్తున్న వరదతో కొండవీడు వాగు నిండుకుండలా మారింది. మరోవైపు కృష్ణానది సైతం ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో నిండిపోయింది. గురువారం నదిలో నీటిమట్టం ఊహించని రీతిలో 15 అడుగులకు చేరింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో నది నుంచి 5.66 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. రెగ్యులేటర్ గేట్లు ఐదు పూర్తిగా, మిగిలినవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటి నుంచి ప్రతి గంటకూ సుమారు 700 క్యూసెక్కుల నీరు కొండవీడు వాగులోకి చేరుతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇదే నీటని లిఫ్ట్ మూడు పంపులు ద్వారా తిరిగి కృష్ణానదిలోకి తోడుతున్నారు. ప్రతి గంటకు 1,059 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ ద్వారా నదిలోకి చేరవేస్తున్నారు. దీనిలో అమరావతి గ్రామాల నుంచి వచ్చే నీరు సుమారు 350 క్యూసెక్కులు, కృష్ణానది నుంచి వాగులోకి వచ్చే నీరు గంటకు 700 తోడాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతం నుంచి వాగు నీటిని బకింగ్‌హామ్ కాల్వలోకి రెండు గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి వదులుతున్నారు.

10 వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లకు నోటీసులు

● అసత్య కథనాల కట్టడికి పోలీసుశాఖ చర్యలు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాల కట్టడికి పోలీస్ శాఖ నడుం బిగించింది. వాట్సాప్ గ్రూపుల్లో పోలీసు అధికారులను, సిబ్బందిని సభ్యులుగా చేర్చుకుని కథనాలు పోస్టు చేస్తూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో.. పోలీస్ శాఖ చర్యలకు సిద్ధమైంది. సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు సృష్టించి పోస్ట్ చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసినా అందుకు గ్రూపు అడ్మిన్లదే బాధ్యత అని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా 15 వాట్సాప్ గ్రూపులను గుర్తించారు. ముందుగా 10 క్రైమ్ గ్రూపుల అడ్మిన్ లకు నోటీసులు ఇవ్వాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. వారు నివాసం ఉండే పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల నుంచి వారికి పిలుపు వచ్చింది. స్టేషన్‌కు వచ్చి నోటీసులు తీసుకోవాలని సూచించారు. నగరంలోని లాలాపేట స్టేషన్ పరిధిలో ఉన్న నాలుగు గ్రూప్‌ల అడ్మిన్‌లకు నోటీసులు సిద్ధం చేసి.. వాటిని తీసుకోవాలని ఫోన్‌లు చేసి చెప్పారు. అలాగే అరండల్ పేట, నగరంపాలెం, పెదకాకానితో పాటు పొన్నూరు టౌన్‌కు చెందిన అడ్మిన్‌లు ఉన్నారు. అలాగే మరో రెండు ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల అడ్మిన్‌లు కూడా ఉన్నారు. వారికి కూడా నోటీసులు ఇవ్వనున్నారు. రెండో దఫా కూడా మరికొన్ని గ్రూపులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. అలాగే యూ ట్యూబ్ చానళ్ల పేరుతో.. పోలీసులను, వ్యాపారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న ఘటనలపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. కొందరు ఏకంగా జిల్లా పోలీస్ కార్యాలయానికే వచ్చి బాధితులను డబ్బు డిమాండ్ చేస్తున్న విషయం కూడా పోలీసు అధికారుల దృష్టికి వచ్చింది.

రైల్వేపై మొంథా ఎఫెక్ట్

● చీకటీగలపాలెం, గుండకమ్మ మధ్యన ఒరిగిన రైల్వే లైన్ గట్టు

● వెంటనే మరమ్మతులు చేసిన కార్మికులు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ గుంటూరు - నంద్యాల రైలు మార్గంపై ప్రభావాన్ని చూపించింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా చీకటీగలపాలెం, గుండ్లకమ్మ మధ్యన కొంత భాగం రైలే వ్లైన్ గట్టు దెబ్బతింది. ఎత్తైన ప్రదేశంలో మట్టి జారిపోవడంతో ఒక దశలో రైలు పట్టాలు కూడా ఒరిగిపోతాయని భావించారు. దీనిని గుర్తించిన వెంటనే కీ మెన్‌లు, కార్మికులు అధికారులకు నివేదించారు. రైల్వే అధికారుల సూచనలతో ఇసుక బస్తాలు పేర్చి గట్టు మరింత ఒరిగిపోకుండా కాపాడారు. మరోవైపు గుంటూరు - గుంతకల్లు రైల్వే లైన్ రద్దీ మార్గాల్లో ఒకటి కావడంతో రైళ్లు, గూడ్స్ రేక్‌ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. దీంతో ఈ మార్గంలో రళ్ల రద్దు, దారి మళ్లించడం వంటివి అవసరం లేకుండా పోయింది.



చీకటీగలపాలెం - గుండ్లకమ్మ సెక్షన్‌లో ఒరిగిన రైలుమార్గం గట్టుని కాపాడిన కార్మికులు

ఉప్పొంగిన పాతాళగంగ

బొల్లాపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో మండలంలోని గాటి తండాలో రెండు వ్యవసాయ బోర్ల నుంచి పాతాళ గంగ ఉబికి వస్తోంది. తండాకు చెందిన భూక్యా బద్దునాయక్ మిరప చేనులోని ఈ బోర్లలో నిరంతరం పైకి వస్తున్న నీటిని చూసేందుకు.. స్థానికులు అక్కడికి వస్తున్నారు.



గాడితండా వద్ద వ్యవసాయ బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

తీరనున్న క్రీడా ఇక్కట్లు!

● ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్ ● గోదాముకు చేరుకున్న క్రీడా పరికరాలు

● పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు

గుంటూరు(విద్య): అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఒక్కో పాఠశాలకు రూ.10 వేల నుంచి రూ. 30 వేల విలువైన సామగ్రి అందజేయనున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు సంబంధించిన క్రీడా పరికరాలు క్లస్టర్ పాఠశాలలకు చేరాయి. గుంటూరు క్లస్టర్‌కు సంబంధించి నగర సమీపంలోని ఏటుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల గదుల్లో నిల్వ చేశారు. త్వరలో మండలాల వారీగా స్కూల్స్‌కు పంపిణీ చేయడానికి విద్యాశాఖ ఏర్పాటు చేస్తోంది.

అన్ని ఉన్నా..క్రీడా సామగ్రి లేక..

ఉమ్మడి జిల్లాలో 2000 పైగా ప్రాథమిక, 600 పైగా ప్రాథమికోన్నత, 450 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 6.50 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. అత్యధిక పాఠశాలల్లో విశాలమైన క్రీడా ప్రాంగణాలు అందుబాటులో ఉన్నాయి. జడ్పీ, యూపీ పాఠశాలల్లో నిష్ణాతులైన ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. క్రీడా పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. కూటమి ప్రభుత్వం క్రీడలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఆలోచన చేసింది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు.



బాస్కెట్‌బాల్ శిక్షణలో...



క్రికెట్ సాధన చేస్తున్న విద్యార్థులు

క్రీడా పరికరాల పంపిణీ ఇలా..

ప్రతి పాఠశాలకు అవసరమైన క్రీడా పరికరాల ఇండెంట్లను విద్యాశాఖ సేకరించింది. ఇందులో 67 రకాల బ్రాండ్స్ అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా అవుట్ డోర్ గేమ్స్ క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్, ఖో-ఖో పోటీలకు అవసరమైన క్రీడా పరికరాలు, ఇండోర్ గేమ్స్ కు సంబంధించి క్యారమ్స్, చెస్ బోర్డులు అందజేస్తారు. ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.17వేలు, ఉన్నత పాఠశాలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల ఖరీదు చేసే క్రీడా పరికరాలు అందిస్తారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ద్వారా జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సమర్థంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని డీఈఓ సీవీ రేణుక తెలిపారు. క్రీడా పరికరాలు ఇప్పటికే కొన్ని వచ్చాయని, దశల వారీగా పంపిణీ చేస్తామన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

తమలపాకు రైతులను ఆదుకుంటాం

● మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ కిరణ్‌చంద్



పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ కిరణ్‌చంద్

మంగళగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన తమలపాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ చెప్పారు. గురువారం తమలపాకు పంటను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం వివరాలను నమోదు చేయాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామని కిరణ్‌చంద్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాదల రమేష్‌బాబు, అన్నే చంద్రశేఖర్, జనసేన నేత చింతల ఏడుకొండలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత చేనేతలను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

మంగళగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బీభత్సంతో రాష్ట్రంలోని చేనేత కుటుంబాలు ఉపాధి కోల్పోయి అర్ధాకలితో అలమటిస్తున్నాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని, ముఖ్యంగా గుంటూరు, తెనాలి, మంగళగిరి, చీరాల, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో మగ్గాలు ముంపునకు గురయ్యాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో మగ్గాలు, పరికరాలు, చేనేత ఉపకరణాలు దెబ్బతినడంతోపాటు మగ్గాలపై వస్త్రాలు పాడైపోయాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి చేనేతకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేలు, నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసరాలు అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకట కృష్ణారావు, నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల గిరి, కార్యదర్శి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పెదనందిపాడు, అక్టోబరు, 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోగులమూడిలో వరద ఉధృతికి ఎస్సీ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరడంతో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు టీడీపీ గ్రామ నాయకులు నిత్యావసర, కూరగాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ధనేకుల తేజపవన్, నాయకులు వెలినేని కృష్ణారావు, రామినేని సుమంత్, నల్లూరి అంకమ్మచౌదరి, రామినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి పట్టణం 30వ వార్డుకు చెందిన కుర్రా మురళీకృష్ణకు మంత్రి నారా లోకేశ్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.4 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను స్థానిక నాయకులు గురువారం బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 30వ వార్డు అధ్యక్షుడు బైరబోయిన శివశంకర్, నేతలు బైరబోయిన శ్రీనివాసరావు, కాకర్ల సుబ్బారావు, కుర్రా బాబు, మోడీ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సీపీఎం



పడిపోయిన అరటిపంటను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర నేత బాబూరావు తదితరులు

తాడేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి, పెనుమాకలో మొంథా తుపాను ధాటికి రైతాంగం తీవ్రంగా నష్టపోయారని వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, ఎం రవి తదితరులు కోరారు. గురువారం తాడేపల్లి మండలం ఉండవల్లి పెనుమాకలో నీటమునిగిన పంట పొలాలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, రైతు సంఘం నాయకులు కె.జగదీశ్వరరెడ్డితో కూడిన సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇంటికి సమీపంలోనే తుపాను వల్ల అరటి, ఉల్లి పంటలతోపాటు పూల తోటలు కూడా దెబ్బతిన్నాయని అన్నారు. ఈ రోజువరకు వ్యవసాయధికారులు ఎవరూ దెబ్బ తిన్న పంటపొలాలను పరిశీలించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.రవి, కె.జగదీశ్వరరెడ్డి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, టి బక్కిరెడ్డి, పాల్గొన్నారు. కాగా తుపాను వల్ల నష్టపోయిన పంట పొలాలను ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి జొన్నా శివశంకర్, మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి, గోపాలరెడ్డి, డి.భాస్కరరెడ్డి, బుర్రముక్కు కోటిరెడ్డి, తదితరులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు.

● పెదనందిపాడు: పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు డిమాండ్ చేశారు. కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో నీట మునిగిన పొలాలను రైతు సంఘ నాయకులతో కలిసి పరిశీలించారు.



పెదనందిపాడులో నీటమునిగిన మిరపను పరిశీలిస్తున్న సీపీఎం, రైతు సంఘ నాయకులు

ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యం

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మంత్రి సవితను సత్కరిస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రతినిధులు

తాడేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత అన్నారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సంఘం ఏపీ ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య చైతన్యపోరాట సమితి, వాసవి ఫౌండేషన్, ఐవీఎఫ్ ప్రతినిధులు గురువారం కలిశారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్యులను ఆర్య, శెట్టి, గుప్త, కోమటి, వేగిన, బుక్క, జనపశెట్టి అనే పేర్లతో సంబోధిస్తున్నారని వారందరిని ఆర్యవైశ్యులుగా ప్రభుత్వం గుర్తిస్తూ చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ఆది నుంచి సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఆర్యవైశ్యుల్లోని పేదలను ఆర్థికంగా ఆదుకునేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్యవైశ్యుల కోసం త్వరలో ఏపీ ఆర్యవైశ్య కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. ఆర్యవైశ్యుల కుల దైవం కన్యకాపరమేశ్వరి అమ్మవారు జన్మించిన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ గ్రామానికి వాసవి పెనుగొండ గ్రామంగా త్వరలోనే పేరు మార్చనున్నామని, ఈ మేరకు త్వరలో జీవో రానుందని మంత్రి సవిత తెలిపారు. అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మారక స్మృతివనం ఏర్పాటుకు 6.8 ఎకరాలు కేటాయించారన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రతినిధులు మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు డూండీ రాకేష్, దేవతి భగవన్నారాయణ, చిన్ని రామసత్యనారాయణ, కె.రజని, తల్లం సత్యనారాయణ, పీవీకే నరసింహారావు, కోనా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలను టీడీపీ కన్నబిడ్డల్లా చూసుకుంటుంది

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

● పునరావాస కేంద్రాల్లో నిత్యావసరాల పంపిణీ



ప్రత్తిపాడులో పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదలను కన్నబిడ్డల్లా చూసుకునేది తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన పేదకుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో ఆయన కోయవారిపాలెంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా 25 కేజీల బియ్యం బస్తాతో పాటు కేజీ కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంప, పంచదార వంటి నిత్యావసర వస్తువులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు మీడియా కో-ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, తహసీల్దార్ సుజాత, కాసు పెంటారెడ్డి, కళ్లం రాజశేఖర్ రెడ్డి, గింజుపల్లి శివరామప్రసాద్, సర్పంచ్ మల్లేశ్వరరావు, ఎంపీటీసీ మధు, సీఎస్ టీడీ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

● కాకుమాను: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలోని పునరావాస కేంద్రంలో వరద బాధితులకు ఎమ్మెల్యే రామాంజనేయులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు, ఎంపీడీవో యుగకీర్తి, తహసీల్దార్ వెంకట స్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు ఎమ్మెల్యే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేనాప్రియ, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, మండల అధ్యక్షుడు కోడూరి రాంబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ చాగంటి సత్యహర్ష, జిల్లా తెలుగురైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు చిన్నం ఈశ్వరమ్మ, గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, నియోజకవర్గ ఐటీడీపీ కన్వీనర్ దివ్వి నాగరాజు, నాయకులు నాగండ్ల శ్రీనివాసరావు, రామినేని శ్రీనివాసరావు, నిమ్మగడ్డ గోపీ తదితరులు పాల్గొన్నారు.

నల్లమడ వాగుకు యుద్ధ ప్రతిపాదికన ఆధునీకరణ

కాకుమాను: నల్లమడ వాగుకు ఆదునీకరణ పనులకు యుద్ధ ప్రతిపాదికన చేపడతామని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. మండలపరిధిలోని రేటూరు, అప్పాపురం, కొండపాటూరు, కాకుమాను గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి మాట్లాడుతూ నల్లమడ ఆధునీకరణకు సుమారు రూ.450 కోట్ల నిధులు అవసరమవుతాయని చెప్పారు. నవంబరు 1న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఈ ప్రాంతానికి తీసుకువచ్చి నల్లమడ ఆధునీకరణ ఆవశ్యకత గురించి వివరించి పనులు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అవసరమైతే బడ్జెట్ సమావేశాలో ఈ అంశాన్ని చర్చిస్తానన్నారు. వచ్చే పంటల సమయానికి నల్లమడ, కృష్ణా కెనాల్ రెండు ఆధునీకరణ చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు కొర్రపాటి నాగేశ్వరరావు, మండల టీడీపీ నాయకులు కొల్లా వీరయ్య చౌదరి, నువ్వుల సునీల్ చౌదరి, నూతి శరత్ బాబు, పొన్నం శ్రీనివాసరావు, అగస్టీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

కాకుమాను, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా తోడుంటుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని రేటూరు, అప్పాపురం, కాకుమాను గ్రామాలలో వరద ప్రభావిత ప్రాంతాలను గురువారం స్థానిక నాయకలతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఆయనకు పలు సమస్యలు వివరించారు. డ్రెయిన్‌ల వల్లే ఈ వరద వచ్చిందని, కూటమి ప్రభుత్వం వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఇప్పటికే ఎకరానికి రూ.30 వేలకు పైగా రైతులు ఖర్చు చేశారని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, స్థానిక జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం

తాడేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి మండలంలోని ప్రాతూరు, చిర్రావూరు, గుండిమెడ గ్రామాల్లో కాంగ్రెస్ నేతలతో కలిసి పంటపొలాలను పరిశీలించారు. పంటనష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు షేక్ మున్ని, జిల్లా కాపు సాధికారిక చైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు దర్శనపు శ్యామ్యూల్, మండల అధ్యక్షుడు పఠాన్ సుభాని, జిల్లా ఎస్సీ వైస్ ప్రెసిడెంట్ బుల్లా సమర్పణ కుమార్ పాల్గొన్నారు.

నేడు కుంచనపల్లిలో లోకేశ్ పర్యటన

తాడేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లికి శుక్రవారం ఉదయం 11 గంటలకు మంత్రి నారా లోకేశ్ విచ్చేస్తున్నారు. గ్రామంలోని శ్రీగంగా శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖామంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ హాజరుకానున్నారని, ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల యార్డులో గురువారం జరిగిన వేలంలో 493 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8,500, గరిష్ఠ ధర రూ.12,050, మోడల్ ధర రూ.11,661 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8,500, గరిష్ఠ ధర రూ.12,050, మోడల్ ధర రూ.11,661 పలికాయి.

వరి, పత్తి లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఏవో

పెదనందిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురైన వరి, పత్తి పంటల్లో తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో ఐ.సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని పుసులూరులో నీట మునిగిన వరి, పత్తిపంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సంరక్షణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రస్తుతం వరిపంట పూత, కోత దశల్లో ఉందని అన్నారు. వీలైనంత వరకు వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

● వట్టిచెరుకూరు: పత్తి, మినుము, మాగాణి భూముల్లో నీరు నిల్వ ఉందని, తక్షణమే సాధ్యమైనంత వరకు నీటిని బయటకు పంపటం ద్వారా ఆయా పైర్లను కొంత మేరకు రక్షించు కోగలమని ఏవో చందోలు సునీత అన్నారు. మండలంలోని కొర్నెపాడు, వింజనంపాడు, చెమళ్ళమూడి, కుర్నూతల గ్రామాల ఆయకట్టులోని పత్తి, మినుము, మాగాణి భూములను ఆయా గ్రామాల రైతులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

విపత్తులతో అప్రమత్తంగా ఉండాలి

● మండల స్పెషల్ ఆఫీసర్ జీ శ్రీనివాసరావు



బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న స్పెషల్ అధికారి , తహసీల్దార్

వట్టిచెరుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విపత్తుల పట్ల ప్రజలు ముఖ్యంగా కాల్వ కట్టలు, పల్లపు ప్రాంతాల్లో ఉండేవారు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్, ఎస్సీ కార్పొరేటషన్ ఈడీ జీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అనంతవరప్పాడు, గారపాడు గ్రామాల్లోని హైస్కూళ్లలో పునరావాస బాధితులకు గురువారం తాత్కాలిక భృతిగా 25 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను తహసీల్దార్ క్షమారాణితో కలసి పంపిణీ చేశారు. అనంతరం పునరావాస కేంద్రాల నుంచి సొంత ఇళ్లకు బాధితులు తరలివెళ్ళారు.

జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

మంగళగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జై భారత్ ఆధ్వర్యంలో నవంబరు 8, 9వ తేదీల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా జయహో జాతీయ సమ్మేళనం హైదరాబాద్‌లో జరుగుతుందని ఎంపీజే రాష్ట్ర సలహాదారుడు మహమ్మద్ యూసుఫ్ తెలిపారు. ఈ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను గురువారం మంగళగిరిలో వివిధ సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. దేశ సమైక్యత, స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్, మహాత్మా గాంధీ, గఫార్ ఖాన్, స్వామి వివేకానంద స్ఫూర్తితో మూడో జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశ సమైతక్యను కోరుకునే ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు శ్రీనివాస్ రాజమణి, కౌతరపు ప్రసాద్, రేఖా కృష్ణార్జునరావు, గురుదత్త స్వామి, షంషుద్దీన్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

పెదనందిపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు జడ్జి గవాయ్‌పై దాడిని ఖండిస్తూ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కారుమూరి అంకయ్య పిలుపునిచ్చారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 1న హైదరాబాద్‌లో జరిగే నిరసనకు పలు రాష్ట్రాల దళిత సంఘాల నాయకులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వరగాని కైసర్, తొండేపు రమేష్, కారుమూరి వినోద్, పాలెపు రమేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా శానిటేషన్ పనులు

దుగ్గిరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శానిటేషన్ పనులు గురువారం ముమ్మరంగా చేపట్టారు. మూడ్రోజులపాటు కొనసాగిన ఎడతెరపిలేని వర్షంతో పలు చోట్ల పారిశుధ్య సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో మురుగుకాల్వల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టారు. మురుగు నీటిపారుదల మరింత మెరుగుపరచి, దోమల వ్యాప్తి చెందకుండా అధికారులు వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో కావూరి జవహర్‌లాల్, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

దుగ్గిరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల రైలుపేటలోని శ్రీ కల్యాణవేంకటేశ్వర ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామికి అభిషేకాలు జరిపిన అనంతరం, 23 రకాల పుష్పాలతో కనువిందుగా అలంకరించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు రామచంద్ర, సాకేత్‌ల పర్యవేక్షణలో నిర్వహించారు. గ్రామానికి చెందిన వంకదార సుబ్బారావు-హరిలక్ష్మి, నాగార్జున-ప్రియాంక దంపతుల చేతులమీదుగా జరిపిన కల్యాణోత్సవానికి భక్తులు తరలివచ్చారు.

లంక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



వెంకటపాలెం పునరావాస కేంద్రంలో నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

తుళ్లూరు అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విపత్తులను ఎదుర్కోవటానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన వెంకటపాలెం పునరావాస కేంద్రంలోని 33 పేద కుటుంబాలకు బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతున్న దృష్ట్యా లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుళ్లూరు, రాయపూడి, అనంతవరం, గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాల్లో నిత్యావసరాలను అధికారులు, కూటమి నాయకులు పంపిణీ చేశారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పోతినేని, టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో ఉపాధి కోల్పోయిన పేద కుటుంబాలకు స్థానిక టీడీపీ నేతలు గురువారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కొమ్మా సుకుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్ మాన్యం మల్లేశ్వరి, వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ మోతుకూరి రవి, కూటమి నేతలు జొన్నకూటి శ్రీనివాసరావు, తాతా కోటయ్య, గద్దె రామస్వామి, సామరౌతు శివనాగేశ్వరరావు, లాజరు, గద్దె రాజరాజేశ్వరరావు, జొన్నకూటి నరసయ్య, యర్రంశెట్టి సునీత, లీలావతి, కే.రామాంజనేయులు, చిట్టేల శ్రీనివాసరావు, తమ్మిశెట్టి రమణయ్య, కట్టా కృష్ణ, దాసరి వెంకటేశ్వర్లు, తోట సాంబశివరావు, ఆకాశం శివరామకృష్ణ, బిట్రా మోహన్ పాల్గొన్నారు.

తాడికొండలో పునరావాస కేంద్రంలో..



బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

తాడికొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో తాడికొండ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధిత కుటుంబాలకు గురువారం రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి 25కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, పంచదార, ఆయిల్ ప్యాకెట్‌తో పాటు, ఒక్కో వ్యక్తికి రూ.1000లు చొప్పున నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. మొత్తం 8 కుటుంబాలకు నిత్యావసర సరుకులు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సమతావాణి, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌నాయక్, ఆర్ఐ హనుమంతరావు, వీఆర్‌వో రాంబాబు, బ్రహ్మయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆలపాటి బాలయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు ప్లేట్లు పంపిణీ



గుండాలపాడులో ఉపాధి హామి కార్మికులకు ప్లేట్లు, గిన్నెలను పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా నేత కోటేశ్వరరావు

ఫిరంగిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కార్మికులకు సాంఘిక భద్రత అనే అంశంపై ఫిరంగిపురం మండలం గుండాలపాడు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది డాక్టర్ మల్లాది కోటేశ్వరరావు పరిశోధన చేసి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా తన స్వగ్రామమైన గుండాలపాడులో గురువారం టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు చేతుల మీదుగా ఉపాధి కార్మికులకు స్టీలు ప్లేట్లు, గిన్నెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడపాటి వెంకయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ మహమ్మద్ యాకూబ్, మాజీ సర్పంచ్ షేక్ బికారీ, గ్రామ పెద్దలు జాగర్లమూడి విశ్వేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటరావు, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు మత్స్యకార కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

తాడేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను వల్ల జీవనభృతి కోల్పోయిన 250 మంది మత్స్యకార కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేయనున్నట్టు తహసీల్దార్ డి.సీతారామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సీతానగరం రామకృష్ణ మిషన్ హైస్కూల్లో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

లోక కల్యాణం కోసం వేదపారాయణ: సామవేదం

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం వేద పారాయణ కార్యక్రమాన్ని చేపట్టామని సామవేదం సత్యనారాయణ చెప్పారు. నాజరుపేటలోని విద్యాశంకర భారతీ నృశింహ స్వామి సదన్‌లో గురువారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని వేదపారాయణ చేశారు. వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పారాయణలో వేదపండితులను సన్మానించారు. తాడేపల్లి సూర్యనారాయణమూర్తి, వెంకటసుబ్రహ్మణ్యం, కామేశ్వరరావు, ప్రభాకరశర్మ, అంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ముందు జాగ్రత్తతో తగ్గిన తుఫాన్ నష్టం

● తెలుగు రైతు అధ్యక్షుడు ఈదర

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో తుఫాన్ నష్టం గణనీయంగా తగ్గిందని నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఈదర పూర్ణచంద్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు దూరదృష్టితో ఆలోచించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వల్ల నష్టనివారణను తగ్గించగలిగామని చెప్పారు. నియోజకవర్గంలో నష్టపోయిన రైతులను వ్యవసాయ అధికారులు గుర్తించే కార్యక్రమం చేపడతారని రైతులు అందుబాటులో ఉండి తమకు జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. వ్యవసాయాధికారులు జాబితాలు రూపొందించి గ్రామాల్లో బహిరంగంగా ప్రదర్శించాలని తద్వారా నిజమైన రైతులకు పరిహారం అందుతుందన్నారు. అర్హులైన రైతులకు జాబితాలో పేరు లేకపోతే నాయకులు, అధికారుల దృష్టికి తేవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎన్.నాగేశ్వరరావు, ఖుద్దూస్, వి.అశోకవర్ధన, జె. మహేష్, ఆంజనేయులు, అరుణ, దుర్గాప్రసాద్, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోటి సోమవార పూజలు

చేబ్రోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం సందర్భంగా కోటి సోమవార శ్రవణ నక్షత్ర పర్వదినం పురస్కరించుకొని చేబ్రోలులోని శ్రీ గంగాపార్వతి సమేత నాగేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో శ్రవణా నక్షత్ర యుక్త శుభదినాన్ని భక్తులు విశేషంగా ఆచరించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు దేవాలయాలను దీపాలతో అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, దీపారాధనల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా గాంధీ వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం చేశారు. దివ్వెల వెంకటశ్రీనివాసరావు కుటుంబసభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముద్దాభక్తుని రమణయ్య, రామలింగాచారి పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

● బీవోఐ బీఎం నవజ్యోతి

తెనాలి క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి వృతి విద్యా కోర్సులను అవగతం చేసుకోవడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ కె.నవజ్యోతి తెలిపారు. గురువారం అంగలకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 140 మంది వృత్తి విద్యా కోర్సు విద్యార్థులు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ ట్రేడ్ విద్యార్థులు అంగలకుదురు బ్యాంకు ఆఫ్ బరోడా బ్యాంకును సందర్శించారు. బ్యాంకులు అందిస్తున్న వివిధ రకాల సేవలు, డిపాజిట్లు, రుణాలు, ఏటీఎం ఉపయోగాలు గురించి బ్యాంకు సిబ్బంది వారికి అవగాహన కల్పించారు. బ్యాంకు సిబ్బంది రమ్య, గోపి, అరవింద శాస్త్రి, హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు బాబు, అమర్‌నాథ్, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

'బస్సు యాత్రను జయప్రదం చేయాలి'

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు గండు శివ కోరారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల కోసం బస్సు యాత్ర చేపట్టారని చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థుల జీవితాలను నాశనం చేసిందని ఆరోపిస్తూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. రూ.6400కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, మెడికల్ కళాశాలల్లో పీపీపీ పద్ధతిన రద్దు చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్, సి.సింగారావు, బొల్లిముంత కృష్ణ, రవి పాల్గొన్నారు.

పోలీస్ ఓపెన్ హౌస్

తెనాలి క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా గురువారం డీఎస్పీ కార్యాలయంలో విద్యార్థులకు పోలీసు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పించారు. దేశ రక్షణకు, సమాజంలో అసాంఘిక చర్యల నిరోధానికి పోలీసులు తీసుకునే చర్యలు, విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు, పోలీసులు ఉపయోగించే వివిధ రకాల ఆయుధాల పనితీరు గురించి వివరించారు. నేరస్థులను పట్టుకోవడంలో పోలీసులు ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు రాములు నాయక్, సాంబశివరావు, మల్లికార్జునరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



బొమ్మువానిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం...

పేదలు, రైతులకు మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా

కొల్లిపర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులు, పునరావాస కేంద్రాల్లో ఉన్న నిరుపేదలు అధైర్య పడవద్దని కూటమి ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. గురువారం మండల పరిధిలో తూములూరు లైబ్రరీ సెంటర్‌లో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, తుఫాన్ వస్తుందని తెలియగానే ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని శాఖలను అప్రమత్తం చేసి ఎటువంటి ప్రాణనష్టం జరుగకుండా తగిన చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఎక్కడికక్కడ అధికారులను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్తగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలించి తగిన సౌకర్యాలు అందించామని చెప్పారు. తుఫాన్ ప్రభావంతో పునరావాసం కేంద్రాలకు వచ్చిన వారికి రూ వేయి చొప్పున కుటుంబంలో ముగ్గురుంటే రూ 3వేల చొప్పున నగదు, 25కిలోల రేషన్ బియ్యం, నిత్యావసరాలు అందించినట్లు చెప్పారు. తుఫాన్ ప్రభావంతో వరి, అరటి, మినుము పంటలు దెబ్బతినటం బాధాకరమన్నారు. అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని చెప్పారు. ఏ ఒక్క రైతు ఆందోళన చెందవద్దని, పంట నష్టం జరిగితే ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. టార్పన్ పట్టాలను నూరు శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఎన్నడూ లేని విధంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి 24 గంటల లోపు నగదు రైతుల ఖాతాలో జమచేశామని చెప్పారు. ఈ ఏడాది కూడా రైతులు పండించిన ధాన్యాన్ని ఆఖరి గింజవరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాల్లో నగదును జమ చేసినట్లు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 46లక్షల మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేసినట్లు చెప్పారు. దీపం పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 2కోట్ల 45లక్షల సిలెండర్‌లను ఉచితంగా ఇచ్చామని తెలిపారు. అలాగే మహిళల కోసం స్త్రీశక్తి పథకాన్ని తీసుకువచ్చామని, తద్వారా రాష్ట్రంలో ఎక్కడికైన ఉచితంగా ఆర్టీసీ బస్సులు ద్వారా ప్రయాణం చేయవచ్చన్నారు. అనంతరం బొమ్మువానిపాలెం వెళ్ళి కృష్ణానదికి పెరుగుతున్న వరదను పరిశీలించారు. కృష్ణానదికి 6లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున లంక గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికారులు ఇక్కడే ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ బాణావత్ అరుణాబాయ్, నాయకులు అడపా నారాయణరెడ్డి, యర్రు వెంకయ్యానాయుడు, అడపాల నాగేశ్వరరావు, దివ్వెల ఏడుకొండలు, భీమవరపు కిశోర్ రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు ప్రధాన రహదారులు ధ్వంసం



కసుకర్రు గ్రామంలో భారీ వర్షాలకు గుంతలు పడిన రహదారి

పొన్నూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పొన్నూరు మండలంలో ప్రధాన రహదారులు తీవ్రంగా ధ్వంసం అయ్యాయి. పొన్నూరు పట్టణం నుంచి వెళ్లే ప్రధాన రహదారి జీబీసీ రోడ్డు పలు ప్రాంతాల్లో వర్షానికి దెబ్బతింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జీబీసీ రోడ్డుపై భారీగా వర్షపు నీరు చేరడంతో వర్షపు నీటికి రాకపోకలు సాగించిన భారీ వాహనాలతో రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. రహదారిపై పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడి గుంతల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉంటోంది. భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు గుంతలపై నుంచి రాకపోకలు సాగించిన సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే మండల పరిధిలోని చింతలపూడి గ్రామం వద్ద, వీవర్స్ కాలనీ వద్ద జీబీసీ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. అలాగే మండల పరిధిలోని కసుకర్రు గ్రామం నుంచి కాకుమాను మండలం వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి పూర్తిగా ధ్వంసం అయ్యింది. మండల పరిధిలోని మాచవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వద్ద సుమారు 100 మీటర్ల మేర రహదారి దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో నీరు నిలబడి ప్రజలు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వాన నీటిలోనే రోజుల తరబడి నిల్వ ఉన్న మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే ఇతర ప్రాంతాలను వారు ఈ గుంతల రహదారుల నుంచి ప్రయాణం సాగిస్తుంటే వారికి ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనాలపై వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు స్పందించి తక్షణమే గుంతల పూడ్చివేత పనులు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.

జనసేన ఆధ్వర్యంలో 250 కుటుంబాలకు సాయం



పేదలకు బియ్యం, కూరగాయలు అందజేస్తున్న యన్నం నాయుడు, తదితరులు

పొన్నూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మొంథా తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న నిరుపేద కుటుంబాలు 250మందికి జనసేన నాయకులు యన్నం నాయుడు ఆధ్వర్యంలో బియ్యం, కూరగాయలు పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. రాధా రంగా మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు జనసేన సీనియర్ నాయకుడు యన్నం నాయుడు ఆధ్వర్యంలో జనసేన సీనియర్ నాయకుడు యన్నం నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని తుంగభద్ర కాల్వ కట్టపై నివాసముంటున్న పేద కుటుంబాలకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి తాళ్లూరి అప్పారావు, డి.సూర్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోవాడ వెంకట కృష్ణారావు, పచ్చలతాడిపర్రు సొసైటీ అధ్యక్షుడు గంధం సురేంద్ర, ఏఎంసీ డైరెక్టర్ యలవర్తి వెంకటేశ్వరరావు, ఎం.గోపికృష్ణ, తోట నాగరాజు, ఎం.చంద్రకాంత్, గరికపాటి చిన్నారి, పోకల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



గాలులకు పడిపోయిన అరటి తోటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వరి, అరటి పంటలకు తీరని నష్టం వాటిల్లిందని కూటమి ప్రభుత్వం నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, తూములూరు, కొల్లిపర, చివలూరు, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి తుఫాన్ కారణంగా గాలులకు పడిపోయిన అరటి, వరి పంటలతో పాటు అధిక వర్షాలకు నీటిలో నానుతున్న పసుపు, మినుము పంటలను ఆయన పరిశీలించారు. రైతులను పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రైతులు కష్టపడి సాగు చేస్తున్న పంటలు నీటిలో మునిగిపోవడం గాలులకు పడిపోవడం బాధాకరమన్నారు. అరటి పంట మరో 15రోజుల్లో చేతికంది వస్తుందని అనుకున్న సమయంలో తుఫాన్ కారణంగా పెనుగాలులకు నెలమట్టం అవ్వడంతో ఎకరానికి లక్షా 50వేల రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. అదేవిధంగా వరి పంట కూడా పాలుపోసుకునే సమయంలో ఈదురు గాలులకు కొంత పంట నేలవాల్లిందని మరికొంత నీటిలోనాను తుందన్నారు. గత వైసీపీ పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి రైతులు సాగు చేసిన పంటలకు బీమా సౌకర్యాం కల్పించారన్నారు. ఇటువంటి విపత్తుల సమయంలో పంటలకు నష్టం వాటిల్లితే ఆ బీమా మేలు జరిగేందన్నారు. గత ప్రభుత్వంలో పంట నష్టం జరిగితే ఎకరానికి రూ.50వేల నుంచి 70వేలకు రైతులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పసుపు పంటకు ఎకరానికి రూ.80వేల నుండి లక్ష వరకు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పేరట బీమా చేయకపోవడంతో ఈ తుఫాన్ వలన రైతులకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి జొన్నల శివారెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు అవుతు సాంబిరెడ్డి, నాయకులు భీమవరపు సంజీవరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, పిల్లి గంగాధర్, వంగా సుధాకర్‌రెడ్డి, చెంచల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● సీపీఎం మండల కార్యదర్శి శివాజీ

పెదకాకాని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ గురువారం తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నన్నపనేని శివాజీ మాట్లాడుతూ, మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల మినుము, పెసర, మిరప, వరి పొలాలు బాగా దెబ్బతిన్నాయన్నారు. కౌలు రైతులు ఎకరాకు రూ.50వేల వరకు ఖర్చు పెట్టి, పంటలు దెబ్బతినటం వల్ల నష్టపోయారని అన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కౌలు రైతు సంఘం నాయకుడు సంకురి నీలాంబరం, ఎస్.సాంబయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు

రైతులకు అపార నష్టం: ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

కొల్లిపర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా రైతులకు అపార నష్టం వాటిల్లిందని వారికి తగిన నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. గురువారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర, దావులూరు, చివలూరు గ్రామాల్లో ఈదురు గాలులకు పడిపోయిన వరి, అరటి, కంద పంటలను రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. పంట నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా వరి పంట చేతికి వస్తుందా లేదా అనే అనుమానం రైతులకు కలుగుతుందన్నారు. అరటి తోటలు గాలులకు పడిపోవడం వల్ల ఆ పంట వేసిన రైతులకు ఎక్కువ నష్టం జరిగిందన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన విధంగా ఈ ప్రభుత్వం కూడా రైతులకు పంటల బీమా ఉచితంగా చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. పంట నష్టం అంచనాలు వేసి తక్షణమే ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, కోటా అప్పారావు, కంచర్ల అర్జునరావు తదిరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరిశీలన

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలోని నేలపాడులో గాలి వానకు ఒరిగిపోయిన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంట చేతికొచ్చే దశలో వచ్చిన తుఫాన్ కారణంగా రైతులు నష్టపోయారని తెలిపారు. అధికారుల బృందం పంటను పరిశీలించి నష్టం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి వెంటనే పంపాలని కోరారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, గుర్రం ద్వారకా శ్రీనివాస్, శివకుమార్, స్టీవెన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుల...

తెనాలి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డి కోరారు. నియోజకవర్గంలో తుఫాన్‌కు నష్టపోయిన పంటలను గురువారం పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. వరికి ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు పరిహారం ఇవ్వడంతో పాటు ఉచిత పంట బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. నష్టానికి గురైన పొలాలను అధికారులు పర్యటించి అంచనాలు రూపొందిస్తారని చెప్పారని, గురువారం క్షేత్రస్థాయిలో వారు ఎక్కడా చర్యలు చేపట్టలేదన్నారు. సచివాలయంలో అధికారులను సంప్రదించినా వారికి పంట నష్టం అంచనాల నమోదుపై ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. వెంటనే నష్టం అంచనాలను రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయనతో ములకా శివసాంబిరెడ్డి, బ్రహ్మేశ్వరరావు ఉన్నారు.



వరి పైరును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పంటలను పరిశీలిస్తున్న ఏవో, టీడీపీ నాయకులు

శేకూరులో పంట నష్టంపై టీడీపీ నాయకుల పరిశీలన

చేబ్రోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలో పలు పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షైలా వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, ఏవో ప్రియదర్శినిలతో కలసి నష్టపోయిన పొలాలను సందర్శించారు. రైతుల సమస్యలు, పంట నష్టం వివరాలను తెలుసుకొని, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా షైలా వెంకటరామరాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నారని చెప్పారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలన్నింటిలోనూ త్వరితగతిన పంట నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

860 కుటుంబాలకు నిత్యావసరాలందిస్తాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావ ప్రాంతాలలోని 860 కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గురువారం తెలిపారు. తుఫాను బాధితులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. తుఫాను ప్రభావ ప్రాంత ప్రజలకు బియ్యం, నిత్యవసరాలను అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. బియ్యం 25 కిలోలు, కంది పప్పు కేజీ, వంట నూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, చక్కెర కిలో చొప్పున లబ్ధిదారులకు అందజేయనున్నట్లు చెప్పారు. పొన్నూరు పట్టణంలో 380 కుటుంబాలకు, పొన్నూరు మండలంలో 222 కుటుంబాలకు, చేబ్రోలు మండలంలో 117 కుటుంబాలకు, పెదకాకాని మండలంలో 141 కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



వడ్లమూడిలోని గరువుపాలెంలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

చేబ్రోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం, వడ్లమూడి గరువుపాలెంలోని శ్రీదుర్గా సిద్ధేశ్వర పంచాయతన మణికంఠ క్షేత్రంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పెద్దఎత్తున భక్తులు ఆలయ ప్రాంగణంలో పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే నరేంద్రకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో స్థానికులు, భక్తజనులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విజేతలతో ఉపాధ్యాయులు

డిబేట్, క్విజ్‌లో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం నారాకోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో పాఠశాలస్థాయిలో విజేతలైన నారాకోడూరు, వేజండ్ల, సుద్ధపల్లి, కొత్తరెడ్డిపాలెం, చేబ్రోలు పాల్గొన్నారు. 'ఫ్రీడమ్ మూమెంట్' అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో నారాకోడూరు పాఠశాల విద్యార్థులు మానస దివ్య ప్రథమస్థానం, పి. లిఖిత ద్వితీయస్థానం, కేసీహెచ్.స్కూల్‌కు చెందిన జి.దివ్య తృతీయ స్థానం సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థులు నియోజకవర్గస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో రాయల సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు విజేతలకు అభినందనలు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు వ్యవహరించారు. పోటీలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. విజేతలకు ఎంఈవో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

పారిశుధ్యంపై చర్యలు చేపట్టండి

● ఎంపీడీవో ఊహారాణి



తాగునీటి ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, అధికారులు

చేబ్రోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్, భారీ వర్షాల అనంతరం వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి టి.ఊహారాణి ఆదేశించారు. గురువారం ఆమె, డిప్యూటీ ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎంసీవో, ఎస్‌బీఎం అధికారులతో కలసి పాతరెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాల కారణంగా పారిశుధ్యంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సూపర్ శానిటేషన్, తాగునీటికి సూపర్ క్లోరినేషన్ చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తున్నామన్నారు. గ్రామాలలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ప్రత్యేక కార్యక్రమంగా తొలగించామని, మురుగుపారుదల వ్యవస్థను పునరుద్ధరించే పనులు వేగవంతం చేశామన్నారు. ప్రజలు నీటిని కాచి చల్లార్చి తాగడం అలవాటు చేసుకోవాలన్నారు. పర్యటన సందర్భంగా ఊహారాణి నీటి పథకాలు, ట్యాంకులు, నీటి నాణ్యత పరీక్షలు, పారిశుధ్య పనుల, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి. శ్రీనివాసరావు, ఎంసీవోఎస్‌బీఎం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దశావతార ఆలయంలో హోమ కల్యాణం



సామూహిక హోమ కల్యాణంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో దశావతార వెంకన్నస్వామి)

పెదకాకాని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో సామూహిక హోమ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి జరిగిన హోమ కల్యాణంలో పాల్గొన్నారు. కన్నుల పండుగగా కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వీఐటీయూలో 'ఐక్యా 2కే25'

పెదకాకాని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఐక్యా 2కే25 సాంకేతిక సదస్సు ఘనంగా ప్రారంభమైనట్లు విశ్వవిద్యాలయం ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ గురువారం తెలిపారు ఈ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సీహెచ్ దినేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సులో 30కళాశాలకు చెందిన 1400మంది విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సులో కోడ్ వర్స్, స్పెల్ బిడ్ వంటి 15 సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీహెచ్ దినేష్ రెడ్డి ఐఆర్ఎస్ఈఈ మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టిసారించాలన్నారు. గేట్ పరీక్ష, యూపీఎస్సీ పరీక్షలను లక్ష్యంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ కె.గిరిబాబు, ఈసీఈ విభాగాధిపతి ఎం.భానుమూర్తి ఐఈటీఈ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.